క్లుప్తంగా

చెక్కు పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండలంలోని గంట్రావుపల్లికి చెందిన అనుమోని బాలయ్యకు బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.60వేలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ చిన్నయ్యలు లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు.

అయ్యప్ప మాలధారణ స్వీకరణ

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం ఆలయంలోని అయ్యప్పస్వామి గుడి ప్రాంగణంలో బుధవారం అయ్యప్పస్వాములు మాలధారణ స్వీకరించారు. అర్చకులు వీరయ్యశాస్త్రి, గురుస్వామి కపిలవాయి మహేష్ స్వామి మాలధారణ చేశారు. అచ్చంపేట, డిండి, కల్వకుర్తి ప్రాంతాలకు చెందిన స్వాములు అయ్యప్ప దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో బోయఖాజా, రమేష్‌గౌడు రవీందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



చారకొండ: మండలంలోని జూపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం రూ.2320లు, బీ గ్రేడ్ రకం రూ.2300లు ప్రభుత్వం మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈఓలు వెంకటయ్య, సిబ్బంది బీమయ్య, ఏఈఓ సుష్మ, నాయకులు రాములు యాదవ్, బాల్‌రాజు, జంగయ్య యాదవ్, తిరుపతయ్య చారి, రైతులు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కోడేరు: పౌష్టికాహారంతో ఆరోగ్యం కలుగుతుందని డాక్టర్ దశరథం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు, తీసుకోవాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. అనంతరం ఐరన్, కాల్షియం మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ నారాయణ, ఫార్మాసిస్టు దిలీఫ్, సీహెచ్‌ఓ సుదర్శన్, స్టాఫ్ నర్సు కళావతి, తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడిపై ఏఓ ఆరా

చారకొండ: మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలో రైతు శ్రీనివాస్ సాగు చేసిన వరిపంట దిగుబడిపై బుధవారం మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ ఆరా తీశారు. రైతు బీపీటీ రకం 3082 కొత్త వంగడాన్ని సాగు చేసినట్లు రైతు తెలిపారు. 135 రోజుల్లో పంట చేతికి వచ్చి ఎకరానికి 35 క్వింటాల దిగుబడి వచ్చిందని వివరించారు. ఎలాంటి తెగుళ్లు, పురుగులు ఆశించలేదని తెలిపారు. ఏఈఓ మహేశ్వరి, రైతులు తదితరులు ఉన్నారు.

వర్గీకరణతో మాదిగలకు మంచి భవిష్యత్

కల్వకుర్తి రూరల్: వర్గీకరణతో మాదిగలకు మంచి భవిష్యత్ ఉంటుందని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహేష్ మాదిగ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 7న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే మాదిగల ధర్మయుద్ధ సదస్సుకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో భరత్ మాదిగ, కిరణ మాదిగ,శేఖర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించాలి

కోడేరు: మండలంలో ఇంటర్మీడియేట్ విద్యార్థులు ఈనెల 26 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు రూ.100ల అపరాధ రుసుముతో చెల్లించేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

సీఎంను కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

వెల్దండ: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 8న హైదరాబాదులోని ఆర్యవైశ్య కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన ప్రారంభోత్సవానికి సీఎంను ఆహ్వానించినట్లు వారు తెలిపారు.

సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం



నాగర్‌కర్నూల్ మండలం కొనపర్తిలో..



కోడేరు మండలం తీగలపల్లిలో..

సాక్షి, నెట్‌వర్క్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా మొదటి రోజు పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లను అతికించారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఇంటింటి సర్వేలో భాగంగా కుటుంబ వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. కొనపర్తిలో సర్వేను ఎంపీడీఓ కోటేశ్వర్ పర్యవేక్షించారు.
- కొల్లాపూర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు, కమిషనర్ శ్రీనివాసన్‌లు పట్టణంలోని పలు వార్డుల్లో వారు పర్యటించారు. సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు.
- కల్వకుర్తి మండలంలోని జిల్లేల, మార్చాల గ్రామాల్లో ఎంపీడీఓ వెంకట్రాములు స్టిక్కరింగ్‌ను, సర్వే సామాగ్రిని తనిఖీ పరిశీలించారు.
- కోడేరు మండలం జనుంపల్లి, తీగలపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, తహశీల్దార్ విజయ్‌కుమార్ సర్వేను పరిశీలించారు. ప్రతి ఇంటికి స్టిక్కర్లు వేయాలని సిబ్బందికి సూచించారు.
- లింగాలలో సమగ్ర కుటుంబ సర్వే పనులను ఎంపీడీఓ ఆంజనేయులు, ఎంపీఓ చంద్రశేఖర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.
- వంగూరు మండల కేంద్రంలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి పాల్గొని సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీఓ విజయభాస్కర్, సర్వే అధికారులు ఉన్నారు.
- తాడూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సమగ్ర ఇంటింటి సర్వే ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గన్నోజు బ్రహ్మచారి తెలిపారు. ఇప్పటివరకు 10229 కుటుంబాలను గుర్తించి స్టిక్కర్లను అంటించామని పేర్కొన్నారు.
- పెద్దకొత్తపల్లిలో ఎంపీడీఓ నాగేందర్, సూపరింటెండెంట్ చంద్రశేఖరెడ్డిలు ఇంటింటి సర్వేను పరిశీలించారు. గ్రామస్తులు సర్వేకు సహకరించాలని కోరారు.



కొల్లాపూర్‌లో స్టిక్కరింగ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు, కమిషనర్



లింగాలలో..



వంగూరులో..



తాడూరులో..



పెద్దకొత్తపల్లిలో..

ఇళ్లను క్రమబద్ధీకరించాలని ఎమ్మెల్సీకి వినతి



నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలోని బీసీ కాలనీలో 20 సంవత్సరాలుగా నివాసముంటున్న లబ్ధిదారుల ఇళ్లను క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు మాట్లాడుతూ గతంలో లబ్ధిదారులకు 110 గజాల చొప్పున పట్టాలు ఇచ్చారని ఆ స్థలంలో నివాసాలను నిర్మించుకొని జీవిస్తున్నారని వివరించారు. వారి ఇళ్లను క్రమబద్ధీకరించకుండా అధికారులు నోటీసులు జారీ చేశారని ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు ఆర్ శ్రీనివాసులు, పొదిలి రామయ్య, కొంపల్లి అశోక్, అంతటి కాశన్న, కృష్ణయ్య బాలయ్య, జ్యోతి, వెంకటమ్మ, అలివేల, చంద్రకళ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బీజేపీ కుట్ర

మన్ననూర్: ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు మద్దెల దివాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అన్నదమ్ముల్లా ఉన్న మాల మాదిగలను విడదీయొద్దన్నారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే ఎస్సీ మధ్య చిచ్చుపెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ గ్రూపులో 59 కులాల జనాభా లెక్కలు నమోదు చేసి అందరికి సమ న్యాయం చేయాలని కోరారు.

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



మాట్లాడుతున్న శంతన్

అచ్చంపేట రూరల్: విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఏబీవీపీ అచ్చంపేట నగర కార్యదర్శి శంతన్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా శంతన్ మాట్లాడుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయొద్దన్నారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తైన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా విద్యా వ్యవస్థ తీరు మారడం లేదని ఆవేధన వ్యక్తం చేశారు. స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్, వంశీ, కమల్, వరుణ్, హేమంత్, క్రిష్, అర్జున్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

అచ్చంపేట రూరల్: ఉమామహేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి బుధవారం మండలంలోని పులిజాల గ్రామానికి చెందిన బీరం రాజేశ్వర్ రెడ్డి, మాధవి దంపతులు రూ. 25116లు విరాళం అందజేశారు. దాతలను ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరావు, దాత కుమార్తె అక్షిత, పాలక మండలి సభ్యుడు పవన్, ఆలయ సిబ్బంది కవికుమార్, రామకృష్ణ, లక్ష్మయ్య, సతీష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు క్రీడల నిర్వహణపై సమావేశం

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి ప్రారంభ కానున్న 10వ జోనల్ క్రీడలకు సంబంధించి గురువారం పీడీలు, పీఈటీలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా జోనల్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఆయా గురుకుల పాఠశాల, కళాశాలల పీడీలు, పీఈటీలు హాజరు కావాలని ఆయన కోరారు.

9న కళాకారుల ఎంపిక



నాగర్‌కర్నూల్ క్రైం: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో 9న ఉదయం 10 గంటలకు 'నూరేండ్ల నా ఊరు' గేయ కావ్యం కోసం గాయని, గాయకుల ఎంపిక ఉంటుందని జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య గౌడ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రామచంద్ర, రాములు, వెంకటేష్, లక్ష్మి ఉన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

పెంట్లవెల్లి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కొల్లాపూర్ మండల మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బుదవారం మండల కేంద్రంలో రైతు రుణమాఫీ పూర్తి చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, శ్రీరామ్, ప్రకాష్, బాలు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబెట్టొద్దు

కోడేరు: ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దని ఎస్ఐ గోకారి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కుప్పలపై నల్లటి టార్పలిన్లు కప్పడంతో వాహనదారులకు కన్పించక ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. గతంలో మంత్రాలమ్మ వద్ద రోడ్డుపై ధాన్యం కన్పించకపోవడంతో వాహనం వెళ్తున్న ఇద్దరు మృతి చెందిన ఘటన ఉందని తెలిపారు. ఎవరైనా రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలపను తరలిస్తే చర్యలు



పెంట్లవెల్లి: అటవీ ప్రాంతం నుంచి ఎవరైన కలపను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ రేంజర్ కాశన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కట్టె కోత మిషన్లను ఆయన తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఒక కట్టెకోత మిషన్ నిబంధనలకు విరుద్ధం నడిపించడంతో రూ. 3 వేలు జరిమానా విధించారు. అధికారులు వెంకటయ్య, ముజీబ్, కృష్ణయ్య, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

తాడూరు: మండలంలోని మేడిపూర్ ప్రాథమిక పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి కంచర్ల ఆనంద్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు టై, బెల్టులతో పాటు విద్యా సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు లక్ష్మి, కరుణాకర్, వేదవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ నిర్మాణం కోసం అభిప్రాయం సేకరణ



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కార్తీక్‌కుమార్

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో బుధవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్ రిజర్వాయర్ నిర్మాణం కోసం రైతుల ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. డిండి-నార్లాపూర్ ప్రాజెక్టులో భాగంగా ఇరివ్‌న్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు భూసేకరణకు వెళ్లారు. దీంతో గ్రామ రైతులు రిజర్వాయర్ నిర్మించొద్దని అడ్డుకున్నారు. అధిక సంఖ్యలో గౌడ కులస్తులు ఉన్నారని, తాటిచెట్లు, ఈత చెట్లు రిజర్వాయర్‌లో కోల్పోవడంతో గౌడకులస్తులు ఉపాధి కొల్పోతున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు అవగాహన కల్పించడానికి ప్రత్యేక గ్రామసభను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు వివరించారు. అనంతరం రైతుల అభిప్రాయ సేకరణ తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, కార్యదర్శి రవీందర్, సర్వేయర్లు, గ్రామస్తులు, రైతులు తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ సత్యం అన్నారు. బుధవారం 8వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ నిధుల కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాణ్యతతో పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు శీరున, సైదులు, మున్సిపల్ ఏఈ షబ్బీర్, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులకు వారం రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతు సమన్వయసమితి మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తచాటి విజయం సాధించాలన్నారు. హెచ్‌ఎం వెంకటరమణ, మల్లేష్‌యాదవ్, మదన్‌మోహన్‌రావు, నరేష్‌గౌడు, తిరుపతయ్య, ప్రసాద్, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం



కల్వకుర్తిరూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయితి ఆశాదీప్‌రెడ్డి అన్నారు. మండలంలోని తాంద్రలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాల, బాలికల ఖో-ఖో క్రీడలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి, జయసింహారెడ్డి, హెచ్‌ఎం జహంగీర్, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం పోస్టుకు ఇంటర్వ్యూలు

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఏఎన్‌ఎం పోస్టుకు బుధవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి సమక్షంలో పాఠశాల ఆవరణంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. ఒక ఏఎన్‌ఎం పోస్టుకు 15మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా 11 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.

ఆర్డీఓకు వినతి

కల్వకుర్తి రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో బుధవారం ఆర్డీఓ శ్రీనునాయక్‌కు సీఐటీయూ జిల్లా అధక్షుడు అంజనేయులు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అంజనేయులు, బాలస్వామి, నిర్మలమ్మ, శాంతమ్మ, కళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అచ్చంపేట: పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు చెందిన 1970–75 సంవత్సర పూర్వవిద్యార్థుల సమ్మేళనం శుక్రవారం నిర్వహిస్తునట్లు పూర్వవిద్యార్థులు బుధవారం ఓప్రకటనలో తెలిపారు.

సైబర్‌మోసాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీఐ శంకర్‌నాయక్

మన్ననూర్: సైబర్‌మోసాలపై అప్రమత్తంగా ఉండాలని అమ్రాబాద్ సీఐ శంకర్ నాయక్ అన్నారు. బుధవారం మన్ననూర్‌లోని ఈగలపెంట, పదర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలకు సైబర్‌మోసాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే వ్యక్తిగత సమాచారం చెప్పొద్దన్నారు. సీబీఐ, స్పెషల్ పోలీసులం అని చెప్తూ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. అమ్రాబాద్, ఈగలపెంట ఎస్ఐలు రజిత, వీరమల్లు, హెచ్‌సీ బాలు నాయక్, కానిస్టేబుల్ శంకర్, సుక్యానాయక్, నాయకులు వెంకటరమణ, రహీం, సత్యం, రవి, శ్రీనివాసులు, ముత్యాలు, సత్యనారాయణ, కర్ణయ్య, నిరంజన్, వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఎస్ఐ కురుమూర్తి సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం సుగుణ, ఏఎస్ఐ జాకిర్ ఉల్లా, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రైతుల ఆందోళన

కల్వకుర్తి రూరల్: మండలంలోని తర్నికల్‌లో బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. 60 సంవత్సరాలుగా భూమిని నమ్ముకొని బతుకుతున్న తమకు అన్యాయం చేయొద్దన్నారు. భూముల హక్కుకోసం గ్రామంలో వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. సర్వే నంబర్ 348లో 12 ఎకరాలు, సర్వేనంబర్ 473, 474లలో 32 ఎకరాలకు అధికార పార్టీ నాయకుడు కబ్జాకు పాల్పడ్డాడని ఆరోపించారు. రైతులకు తిరిగి భూమి ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు ఆచారి రైతులకు మద్దతు ప్రకటించారు. పాండుగౌడు, బండెల రామచంద్రారెడ్డి, సురేందర్‌గౌడు, లక్ష్మయ్య, శ్రీశైలం, సురేష్‌గౌడు, రుక్మదిన్‌పాటు పలువురు పాల్గొన్నారు.

చెంచు బాలకార్మికులకు విముక్తి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం గ్రామ సమీపంలో మ్యాదర్ బండలో ముగ్గురు చెంచు బాలకార్మికులకు బుధవారం విముక్తి కల్పించారు. ముక్కిడిగుండం గ్రామానికి చెందిన సాయికృష్ణ మేకల కాపరిగా బాలకార్మికులను పనిలో పెట్టుకున్నాడు. బాలసంరక్షణ భవన్, నేషనల్ ఆదివాసి సాలిడ్ సంస్థ సంయుక్తంగా బాలకార్మికులను గుర్తించారు. యజమాని సాయికృష్ణను బుధవారం కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ ఎదుట హాజరపర్చగా కౌన్సెలింగ్ ఇచ్చారు. విచారణ అనంతరం బాలకార్మికులకు విముక్తి కల్పించి నాగర్‌కర్నూల్ స్కూల్‌లో చేర్పించడానికి బాల సంరక్షణ భవన్ బృందానికి అప్పగించారు. కార్యక్రమంలో లీగల్ అధికారి రాంకుమార్, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, నేషనల్ ఆదివాసి సాలిడ్ సంస్థ లీగల్ అడ్వైజర్ విజయరాజు, గిర్దవర్ జానయ్య, మహేష్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

అచ్చంపేట రూరల్: ఈ నెల 17న శంషాబాద్‌లో నిర్వహించే రెండో ఏఎన్‌ఎంల మహాసభకు సంబంధించిన కరపత్రాలను బుధవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ విడుదల చేశారు. ఏఎన్‌ఎంలు హిమబిందు, బాలమణి, సావిత్రి, అలివేల, రాజేశ్వరి పాల్గొన్నారు.

9న ఎంపికలు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో 9న జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా.సోలపోగుల స్వాములు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8, 10, 12 బాలబాలికలను ఎంపిక చేస్తునట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్: 9866469054 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

కొల్లాపూర్: సదర్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేందుకు తీసుకున్న నిర్ణయంపై కొల్లాపూర్ యాదవ జాగృతిసేన ప్రచార కార్యదర్శి దాసరి సాయికుమార్‌యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

నలుగురికి శిక్ష ఖరారు

అమ్రాబాద్: డ్రంకెన్ డ్రైవ్‌లో భాగంగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐపై దాడికి పాల్పడిన నలుగురు వ్యక్తులకు బుధవారం జిల్లా సెషన్‌కోర్టు శిక్ష విధించింది. అమ్రాబాద్ ఎస్ఐ రజిత తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం 2017 జూన్ 23న అప్పటి ఈగలపెంట ఎస్ఐ కృష్ణయ్య పోలీసులతో కలిసి మన్ననూర్‌లో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహిస్తున్నాడు. మన్ననూర్‌కు చెందిన నాగిరెడ్డి, రాజిరెడ్డి, జావేద్, సల్మాన్‌లు ఎస్ఐ కృష్ణయ్యతో వాగ్వాదానికి దిగారు. ఎస్ఐని దుర్భషలాడుతూ దాడికి పాల్పడ్డారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బుధవారం జిల్లా సెషన్‌కోర్టు జడ్జి నిందితులకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ.7000 జరిమానా విధించినట్లు ఎస్ఐ రజిత తెలిపారు.

నిందితుడికి జైలు, జరిమానా

తెలకపల్లి: మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన కృష్ణ మే 28న రాకొండ వెళ్లే దారిలో శివగంగా ఫంక్షనల్ వద్ద డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. నిందితుడిని నాగర్‌కర్నూల్ కోర్టులో హాజరుపర్చాగా జడ్జి రామయ్య పది రోజులు జైలు శిక్ష రూ.500 జరిమానా విధించారు.

గీతాకార్మికుడికి గాయాలు

చారకొండ: మండల కేంద్రానికి చెందిన గీతాకార్మికుడు గుండె వెంకటయ్య గౌడ్ బుధవారం తాటి చెట్టు ఎక్కి కల్లు గీసి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే 108 ఫోన్ చేయడంతో ఘటన స్థలానికి అంబులెన్స్ చేరుకొని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్సకోసం వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

సీనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయాలి



కొల్లాపూర్: పట్టణంలో సీనియర్ సివిల్‌కోర్టును ఏర్పాటు చేయాలని బార్‌అసోసియేషన్ న్యాయవాదులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయమూర్తులను వారు కలిశారు. జస్టిస్ శరత్, జస్టిస్ మాధవిదేవిలకు వినతిపత్రం అందజేశారు. హైకోర్టు జడ్జిలు సానుకూలంగా స్పందించారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె శ్రీహరి పేర్కొన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదులు బుజంగరావు, డీఎల్ పాండు, కొల్లాపూర్ న్యాయవాదులు నిరంజన్, రాజేష్, కురుమూర్తి, పసుపుల రాజు తదితరులు ఉన్నారు.